క్లుప్తంగా

తహసీల్దార్‌ను కలిసిన సొసైటీ అధ్యక్షుడు



తహసీల్దార్‌తో ప్రభుదాసు

దొనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బి.రమాదేవిని ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఆదిమూలపు ప్రభుదాసు మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువలతో సన్మానించారు. ఆయన వెంట మల్లెల ఆనందకుమార్, జి.ఐజక్ పాల్గొన్నారు.

దర్శి సీఐగా రామారావు



ఎస్పీ దామోదర్‌తో సీఐ రామారావు

దర్శి: దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై. రామారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సర్కిల్‌లో రిపోర్ట్ అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పర్యవేక్షణ, నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, మహిళలు, పిల్లలు భద్రతకు కట్టుదిట్టమైన చర్యలకు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల సీఐకి దిశా నిర్దేశం చేశారు.

ఉపాధి ప్రజా వేదిక రేపు

ముండ్లమూరు: మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదిక ఆదివారం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఆర్. జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన ఆడిట్ అభ్యంతరాలపై ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్నం రెండు గంటలకు మండల స్థాయి ప్రజావేదిక నిర్వహిస్తామని చెప్పారు. సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన సమస్యలపై జిల్లా స్థాయి అధికారులు సమక్షంలో ప్రజావేదిక నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధిహామీ కూలీలు పాల్గొనాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న సీఐకి సత్కారం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అర్బన్ సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న వై.వి.సోమయ్యను బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బీజేపీ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ సీఐ వై.వి.సోమయ్య అందరి మన్ననలు పొందారన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలను సంరక్షించడంలోను తనదైన శైలిలో సేవలు అందించాడన్నారు. ఈ సందర్భంగా సీఐ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గుమ్మారాముడు, మట్టిమల్ల పుల్లయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

శుభాలు చేసే శ్రావణ మాసం



ప్రత్యేక అలంకారంలో త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి



త్రిపురాంతకం ఆలయంలో ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు ఉదయం నుంచి అమ్మవారి దర్శనంకు క్యూలైన్‌లలో బారులు తీరారు. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి గోత్రనామార్చన, కుంకుమార్చనలు జరిపించారు. అర్చకుడు ప్రసాదశర్మ పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఆలయాలకు వచ్చి పూజల్లో పాల్గొన్నారు.



త్రిపురాంతకం ఆలయంలో క్యూలైన్‌లో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

వివాహ వేడుకలకు హాజరైన బూచేపల్లి



కొత్తపల్లి వివాహ వేడుకలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



మాధవరంలో..

దర్శి: మండలంలో పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శుక్రవారం హాజరయ్యారు. ముందుగా మండలంలోని కొత్తపల్లిలో పాలిమేర బాలకోటిరెడ్డి వెంకటచైతన్యల వివాహానికి వెళ్లారు. అలాగే తాళ్ళూరు మండలం నుసుం శివారెడ్డి అఖిల వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

ఇ- క్రాప్‌లో పంటలు నమోదు చేసుకోండి



మేడపిలో ఇ- క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ నీరజ



దర్శి: ఇ- క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

త్రిపురాంతకం: ప్రతి రైతు ఇ- క్రాప్‌లో పంటలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. నీరజ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం మేడపిలో ఇ- క్రాప్ పంటల నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు సెప్టెంబర్ 15 లోగా నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వం నుంచి అందే ప్రతి రాయితీకి అర్హత పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

దర్శి: ఇ- క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని వ్యవసాయాధికారి వి. బాలకృష్ణ నాయక్ సూచించారు. బొట్లపాలెం, తూర్పువీరాయపాలెం, పాతకమూరు రైతు సేవా కేంద్రాల పరిధిలో ఇ- క్రాప్‌ను మండల వ్యవసాయ అధికారి బాలకృష్ణ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ పంట ప్రాధాన్యత గురించి రైతులకు తెలియజేశారు. ప్రతి రైతు తాము వేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. భూ యజమానులు కౌలు రైతులకు పంట సాగు దారు హక్కు పత్రాలకు సహకరించి సరైన కౌలు రైతులకు అందజేయాలని కోరారు. షేక్ మాసుం బాజీ, మనోహర్, దేవ శంకరమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



మొట్ల మల్లికార్జునపురం గూడెంలో జరిగిన ఆదివాసీ దినోత్సవంలో గిరిజనులు

పెద్దదోర్నాల: గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఏఆర్‌హెచ్‌ఈడీఎస్ సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎ. కరుణాకర్ అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని మొట్ల మల్లికార్జునపురంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వ పరంగా అందుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. దుర్వ్యసనాలను దూరం చేసుకోవాలన్నారు. మారుతున్న నేటి ఆధునిక నాగరిక సమాజంలో చెంచు గిరిజనులు ఓ భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ గిరిజనులకు విద్య ప్రాముఖ్యత తెలియజేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. నాటి నుంచి నేటి వరకు స్త్రీ, పురుషులు మధ్య ఉన్న వివక్ష తొలగిపోలేదని దీన్ని అధిగమించి మహిళలు ఆర్థికంగా రాణించాలన్నారు. సమాజంలో మంచి పేరు తీసుకుని వచ్చి రాబోయే తరాలకు మార్గదర్శకంగా ఉండాలని కోరారు. గిరిజనులు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని ధైర్యంగా ముందుకు వెళ్లినప్పుడే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి సార్థకత చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో మంగమ్మ, ప్రసాద్, సంస్థ ప్రతినిధులు కోటేశ్వరరావు, వెంకటరమణ, దావీదు, స్యామ్యేల్, జాన్ తదితదులు పాల్గొన్నారు.

వేడుకగా రామాలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని పేరారెడ్డిపల్లి గ్రామంలో సీతా లక్ష్మణ హనుమత్ సహిత పట్టాభిరామచంద్ర స్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వేద పండితుడు గూడా లక్ష్మీనారాయణశర్మ బృందం ఆధ్వర్యంలో పూజా క్రతువులు నిర్వహిస్తున్నారు. కలశ స్థాపనలో ఉభయదాతలుగా గ్రామస్తులు వ్యవహరించారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు

రాచర్ల: మండలంలోని కాలువపల్లె పంచాయతీ పరిధి గంగంపల్లె గ్రామంలో పోలేరమ్మ, అంకాలమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా శుక్రవారం పోలేరమ్మ, అంకాలమ్మ, పోతురాజు నూతన విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం శనివారం ఉదయం పోలేరమ్మ, అంకాలమ్మ, పోతురాజు నూతన విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రతి కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలి

రాచర్ల: ప్రతి కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డు తప్పనిసరిగా ఇవ్వాలని గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీనాయక్ అన్నారు. మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు, రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని కౌలు కార్డుకు దరఖాస్తులు చేసుకునే ప్రతి ఒక్కరికీ కౌలు గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు

పొదిలి: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా పొదిలి పట్టణంలోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయం, నిర్మమహేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం, వాసవీ మాత ఆలయం, అంకాల పరమేశ్వరి, మహలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కార్పొరేట్ల నుంచి వ్యవసాయాన్ని కాపాడండి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

యర్రగొండపాలెం: దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్లను బహిష్కరించి వారి చేతుల నుంచి వ్యవసాయ రంగాన్ని రక్షించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్ వద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నరేంద్రమోదీ ప్రధానిగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గౌతం ఆదాని, అంబానీ సోదరులు, వేదాంత అనిల్ అగర్వాల్ లాంటి కార్పొరేటర్లకు వివిధ రూపాల్లో లబ్ధి చేకూర్చే విధానాలు అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. సామాన్య ప్రజలపై పన్నుల భారం పెంచి వారికి మాత్రం సంపద పన్ను రద్దు చేశారని, కార్పొరేట్ ట్యాక్స్ 30 నుంచి 20 శాతానికి తగ్గించడం వలన కేంద్రానికి రూ 1.45లక్షల కోట్ల ఆదాయం తగ్గిపోతోందన్నారు. వివిధ రంగాల కార్పొరేట్ కంపెనీలు రైతుల పంటలకు తాము ఇచ్చిందే భిక్షగా పరిస్థితి ఉందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, బాణాల రామయ్య, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యాపర్తి వీరయ్య, రైతు సంఘం నాయకులు మొగిలి వెంకటేశ్వర్లు, బి.లక్ష్మయ్య, జి.వెంకటేశ్వర్లు, యోగయ్య పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలు ప్రమాదకరం



ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

ముండ్లమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పంటా ఏడుకొండలు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించే అన్ని రకాల పంటలకు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. వ్యవసాయ రంగానికి రాయితీలు పెంచి రైతు ఆత్మహత్యలను నివారించాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులను నివారించి, నాణ్యమైన విత్తనాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి రోజు వారి కూలీ ఆరు వందలకు పెంచాలన్నారు. ప్రతి కుటుంబానికీ రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, మీరావలి, శ్రీనివాసరెడ్డి, అంజయ్య, రైతు కూలీలు పాల్గొన్నారు.

పంచాయతీలు పరిశుభ్రంగా ఉండాలి



డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దొనకొండ: గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆపార్డ్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌లు, కార్యదర్శులకు శుక్రవారం పంచాయతీల పరిపాలన, పునఃశ్చరణ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఐక్యతగా ఉండి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పరిపాలన, బడ్జెట్, పారిశుధ్యం, డంపింగ్ యార్డ్స్ ఎలా నిర్వహించాలి, పన్నులు ఎలా వసూలు చేయాలి, పంచాయతీ అభివృద్ధి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డులో వర్మి ఎలా తయారు చేయాలి, తడి, పొడి వేరు చేసి తడి చెత్త నుంచి కంపోస్టు తయారు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. వర్షా కాలం ప్రారంభమైందని, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమం చేపట్టాలని, చేతి పంపులు, కాలువల వద్ద మురికి తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ వేయాలని ఎంపీడీఓ తెలిపారు. ఈఓఆర్‌డీ వైవీడీ ప్రసాద్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి శిక్ష తప్పదు



వివరాలు వెల్లడిస్తున్న ఈఈ కరీం

దర్శి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే అరెస్టు చేస్తామని ఈఈ కరీం హెచ్చరించారు. దర్శి రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ దర్శి పరిధిలో విద్యుత్ తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా 44 మంది అధికారులు, 88 మంది సిబ్బంది కలిసి 3520 సర్వీసులు తనిఖీ చేశారు. అదనపు లోడ్ వాడుతున్న 13 మందికి రూ.44500 అపరాధ రుసుం విధించారు. ఇతర కేటగిరీ కింద వాడుతున్న ఐదు మందికి రూ.22వేలు, మీటర్ లేకుండా విద్యుత్ వాడుతున్న 6 మందికి రూ.12వేలు అపరాధ రుసుం మొత్తం రూ.3 లక్షల 500 రూపాయలు విధించారు. చోరుల వివరాలు 8331019980 వాట్సాప్ నంబర్‌కు తెలియజేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. డీఈ కే పిచ్చయ్య, డీపీఈ శ్రీనివాసరావు, ఏఈ మౌలాలీ ఖాన్, వేణుగోపాల్, పాల్గొన్నారు.





ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న తహశీల్దార్

గిద్దలూరు రూరల్: ప్రజల నుంచి వచ్చే సమస్యల పట్ల సత్వరమే స్పందించాలని తహశీల్దార్ ఆంజనేయరెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని రెవెన్యూ అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూపరంగా ప్రజల నుంచి వచ్చే సమస్యలపై త్వరితగతిన స్పందించేలా ప్రతి అధికారి పనిచేయాలన్నారు. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడంలో అంకితభావంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ చౌకదుకాణాలకు చెందిన డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేషన్ సరుకులు వేసే సమయంలో డీలర్లు అవకతవకలకు పాల్పడకుండా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు తలెత్తకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు వై.పి.రంగయ్య, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామలింగయ్య పాల్గొన్నారు.

కేజీబీవీలో న్యాయమూర్తి తనిఖీ

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం కస్తూర్బా గాంధీ పాఠశాలను మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.కిశోర్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో వసతి సౌకర్యాలు, భోజనాన్ని పరిశీలించి సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య, మంచి భోజనం అందించాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మికి సూచించారు. విద్యార్థినుల భద్రతపై పలు సూచనలు చేశారు. న్యాయవాదులు ఉషశ్రీ, ఎం.అన్వర్‌బేగ్, అనీల్‌రాజ్ ఉన్నారు.